


# రటంతీ కుమార్

బడి వదిలేశారు. పిల్లలు బిలబిలమంటూ క్లాసుల్లోనుండి వచ్చేస్తున్నారు. అందరకన్నా ముందుగా మానిక్‌లాలూ, రటంతీకుమార్ ఇంటితోవ పట్టారు పరుగుల్తో.

"ఒరేయ్ రటంతీ! సాయంత్రం ఐదింటికల్లా మా యింటికి వస్తావట్రా?" అడిగాడు మానిక్‌లాలు.

''ఎందుకోయ్?'' రటంతీ ఎదురు ప్రశ్న వేశాడు.

" టీ పార్టీరా!'' అన్నాడు మానిక్.

"ఓ! ఇవ్వాళ నీ పుట్టిన రోజేఁవిటి?'' ఉల్లాసంగా రటంతీకుమార్ ప్రశ్న వేశాడు.

''థత్! మొద్దు వెధవా! ఏడాదికి ఎన్ని పుట్టినరోజు లొస్తాయిరా? ఈ మధ్యేగా పుట్టిన రోజు చేసుకున్నాను! ఆ వేళ నువ్వు బాగా మెక్కి రాత్రికల్లా కడుపు నొప్పి అని ఏడుస్తూ కూచున్నావుకదూ? అప్పుడు దొడ్డమ్మ వామూ, అల్లమూ నూరి యిచ్చింది. జ్ఞాపకం ఉందా?''

''అవునవును! ఐతే—మరి యీ పార్టీ ఎందుకు?''

''మా రూబీ అక్కను చూడ్డానికి వరుడు వస్తాడట! అందుకని!''

''అరే? రూబీ అక్కకు పెళ్ళయిపోయిందా?...ఎప్పుడూ?''

"నీకేఁవీ తెలీదురా! ... ఇవ్వాళ సాయంత్రం ఖున్నాబాబు వస్తాడు. అక్కను చూసి మాటాడుతాడట! ఆ తరవాత బోల్డు రోజులయితే అప్పుడు పెళ్ళి చేసుకుంటాడు.''

''ఒహ్హో...అవునవును! ఇప్పుడు తెలిసింది.'' అన్నాడు రటంతీ మహా తెలిసినవాడిలా!

రటంతీకి టీ పార్టీలన్నా, విందులన్నా మహా సరదా! అవి ఎక్కడవనీ, ఎందుకవనీ—బాధలేదు. పిలుపువస్తే చాలు!

---


మూలం : బెంగాలీ
స్వర్గీయ పరశురామ్

అనువాదం :
కు॥ జానకిరామ్ పట్నాయక్

హాజరై పోతాడు! ఇంటినుండి బయలు దేరకముందే రటంతీ ఎదట లూచీలూ, పప్పు, ఆకుకూరలూ, కాయకూరలూ, చేపల కలియా. మాంసం ఇగురూ, పులావూ, రసగుల్లాలూ, పంతువాలూ, సందేషులూ, బజ్జీలూ, కచౌడీలూ, తీపి పెరుగూ, పచ్చళ్ళూ నాట్యమాడుతయ్!

సాయంత్రం ఐదు కావస్తున్నది. రటంతీ గబగబా తయారయాడు. ఉన్న వాట్లలో శుభ్రమైన అఫ్‌పంట్లామూ, బుష్‌కోటూ తీసి వేసుకున్నాడు తలకు నూనెరాసి దువ్వుకున్నాడు విసవిస నడుస్తూ బయటకొచ్చే సరికి వెనకనుండి పిలుపు వచ్చింది —

''చూడు రటంతీ! ఈ కారియరు నే నిచ్చినట్లు పిన్నికి చెప్పి ఇచ్చేస్తావూ?'' అన్నది పెద్దక్క

''అలాగే'' అంటూ రటంతీ కారియరు తీసుకున్నాడు— ''ఇదేఁవిటక్కా ఇంతబరువుంది? ఏంపెట్టావే ఇందులో?'' అన్నాడు.

''వాళ్ళింట్లో టీ పార్టీ కదుట్రా? ఫలహారాలు చేసిపెట్టమన్నది పిన్ని. తీసుకు వెళ్ళు! భద్రం సుమా! జారవేసే యగలవ్ ... వచ్చేటప్పుడు కారియర్ తెచ్చేయ్!''

''ఏమేమిటుందే అక్కా?...కలియా, బిరియానీ, ఆమ్లెట్, కట్లెట్, బాదంఖీర్, మామిడిపండ్ల చట్నీ, చేపల కచౌడీ, బర్ఫీ...ఏం? ఇవేనా?''

''ఆఁ...ఆఁ...అన్నీ ఉన్నాయిలే! నీకూ పార్టీలో యిస్తారు. వెళ్ళు!''

''ఐతే అక్కా... టీ పార్టీ వాళ్ల చేస్తుంటే — నువ్వెందు కివ్వన్నీ తయారు చేశావ్? వాళ్ళు చేసుకోలేరూ?''

''నోర్ముయిరా వెధవకానా! వాగుడు కట్టిపెట్టి వెళ్ళు!... పిన్ని చెయ్యమంటే చేశాను — త్వరగా పో!...''

* * *

మానిక్‌యిల్లు దూరంలో లేదు. పదిహేను, ఇరవై నిముషాల నడక. ఐనా ఐదుగిన్నెల కారియరు — ఆ వంట సామగ్రితో మోసుకువెళ్ళేసరికి రటంతీ చెమటలు క్రక్కాడు. నేరుగా ఇంట్లోకి వెళ్ళి మానిక్‌తల్లి భద్రకాళీకి కారియరందించి "పిన్నీ' దీన్ని అమ్మ నీ కిమ్మని చెప్పింది. రూబీ అక్క వరుడింకా రాలేదా పిన్నీ?" అన్నాడు.

''ఒరేయ్, రటంతీ! ఒళ్ళు మండు కొచ్చేలా మాటాడకురా! వెధవ్వి పదేళ్లు ఉన్నాయో లేదో మహా పెద్దవాళ్ళలా అన్నీ నీకే కావాలి!... పానూ అన్నయ్య స్నేహితుడు ఖగేన్‌ఖన్నాబాబు వస్తాడు. టీకి పిల్చాం! తెల్సిందా? ఆఁ...పార్టీలో నోటి కొచ్చినట్టల్లా పేలగలవ్? ...... జాగ్రత!" అన్నది భద్రకాళీ.

అంతలో మానిక్ వచ్చాడు. "పదరా రటంతీ! ఖగేన్‌బాబు ఆరింటికి వస్తాడట! అంతవరకూ కేరమ్స్ ఆడుకుందాం" అన్నాడు

యథాసమయానికి మానిక్ అన్న పానూ... పూర్తి పేరు పన్నాలాలు - ఖగేన్‌ఖన్నా వచ్చాడు. ఖగేన్ అందకాడు. తెల్లగా, పుష్టిగా ఉంటాడు. విశాలమైన నుదురూ, పెద్దకండ్లూ, నవ్వుతూన్న ముఖం! వయసు ఇరవైయైదూ...లేక ఇరవైయారూ ఉంటుంది. పట్టంచుల గ్లాస్‌కో మల్లుపంచ కట్టాడు పొడవాటి సిల్కులాల్చీ వేసుకున్నాడు మణికట్టుకు రవ్వలు పొదిగిన బంగారపు బెల్ట్‌తో ఖరీదైన వాచీ! అంతా సంపన్న గృహస్థు అని చెబుతున్నాయ్! మారిస్ మైనర్ కారులో వచ్చాడు! కాగా, ఖగేన్ తండ్రి పెద్ద వ్యాపారి! అభ్రకమూ, బొగ్గుగనులూ నడిపిస్తున్నాడు ఐదారు లక్షలవరకూ రొక్కం ఆస్థి ఉన్నది. భద్రకాళీ ప్రేరేపణతో పన్నాలాలు ఖగేన్‌బాబును టీకి ఆహ్వానించాడు. వాళ్ళ యిద్దరకూ కాలేజీ పరిచయమూ, గాఢ స్నేహమూఉన్నది. ఖగేనుబాబును చూడగానే భద్రకాళీ ఉబ్బొంగిపోయింది. ఏమవనీ అతణ్ణి అల్లుడుగా చేసుకో నిశ్చయించుకుంది.

పొడవాటి టేబులు వేశారు. ఎంబ్రాయిడరీ నిండిన సిల్కుగుడ్డ దానిమీద పరచారు. పూలు నింపి గాజుకుండీలు రెండు పెట్టారు. నాలుగు పక్కలా కుర్చీలు వేశారు!... ముఖ్య అతిథి ఖగేన్‌ఖన్నా! మిగిలినవారు భద్రకాళీ, రూబీ, పన్నాలాలు, మానిక్‌లాలు, రటంతీకుమార్!... ఇంటి యజమాని



"అయ్యా! ఎవరో మంత్రిగారొస్తారని విన్నాను. వచ్చారా ఏమిటి, అంతమంది జనం ఉన్నారక్కడ"

"ఆ మంత్రిగారిని నేనేనయ్యా. నా కర్మకొద్దీ ఎవరో సినిమాయాక్టరు ఈ రైల్లోనే తగలడ్డాడు."

ఉన్నాడుకాని, ఆఫీసుపనుండి వచ్చేసరికి చాలా ఆలస్యమవుతుందనీ తనకోసం కనిపెట్టుకు ఉండవద్దనీ కబురు పంపించాడు.

ఆరంభంలో చిన్న చిన్న మాటలూ, చిర్నవ్వులూ, తరవాత పెద్దపెద్ద ప్రసంగాలూ, ఆపైన హాస్యవినోదాలూ, నవ్వులూ, అట్టహాసాలూ నడిచాయ్! అనాహూతంగా రూబీ నాలుగు పాటలు పాడింది. పాటలు అయాక భద్రకాళీ

మందస్మితంతో ఖగేన్‌తో అన్నది—

"చూడు బాబూ! మా రూబీకి యీ మధ్య 'ఫ్లూ' తగిలింది. దాంతో గొంతు కాస్త జీరపడ్డది. లేనట్టయితే ఇంకా హాయిగా, శ్రావ్యంగా పాడి ఉణ్ణు!... నెలకు పాతికరూపాయలిచ్చి ఉస్తాద్ గులామ్ ఆలీఖాన్ దగ్గర రెండేళ్ళపాటు సంగీతం చెప్పించాం!"

"అలానా?" అని ఖగేన్ మేజామీద ఉన్న ఒక తైలచిత్రం తీసి చూస్తున్నాడు.

"ఓ!... యీ చిత్రం మా రూబీ వేసిందే! దీనిపేరు 'మస్తమరాళ్' అట!... చూడు!... ఆకాశంలో మేఘాలు... కొలనునిండా నీళ్లు...అందులో ఎర్ర పద్మాలు."

"పద్మాలు కావు...కమలాలు!" సర్దింది రూబీ.

"ఆఁ...ఆఁ...కమలాలు! కొలను ఒడ్డున హంస...ఎలా గంభీరంగా కూచుందో! ఎవరికోసమో...ఆతృత నయనాల్తో...ప్రేమహృదయంతో... చూస్తున్నది!...నిజంగా ఆపేరుకూ... ఆ హంసకూ సరిపోయింది!... ఆఁ... యీ మేజామీద గుడ్డ...ఆ ఎంబ్రాయిడరీ...అంతా—రూబీ తన చేతుల్తోనే అల్లింది. అంతా అజంతా మోడల్!... ఏం? బావుందా?...అరే పానూ...ఆ చేపు తీసుకొచ్చి ఖగేన్‌బాబు ఛాతీ కొలత తియ్యి! కొత్త డిజైనులో ఒక వేస్టును రూబీ అల్లుతుంది...ఖగేన్‌బాబూ!... రూబీ అందచందాలు చూసి ఇక్కడ వాళ్ళంతా ఒక్కటే పోరు అనుకో—మిస్. ఇండియా కాంపిటిషన్‌కు పేరెందు కివ్వలేదని? ఐతే...మేమెంత మొత్తుకుంటే ఏం లాభం?...ఆ తండ్రి మహాశయుడు అంగీకరిస్తేనా? ఆఫీసరు పదవిలో ఉండి నెలనెలా వేలకొద్దీ తెచ్చిపోస్తే మాత్రం? పుట్టుక మాత్రం పల్లెటూరేగా? ఆ బైతుతనం ఎక్కడకు పోతుంది?"

ఇక మానిక్‌లాలు తల్లికి మించిపోయాడు కాబోతూన్న బావగారిని ప్రశ్నల వర్షంలో ముంచివేశాడు—

"మీ చేతిలోని వాచీకి 'కీ' ఇవ్వక్కర లేదు కదూ?...ఆ ఫౌంటెన్‌పెన్ ఖరీదెంత?...మీ మోటారులో రేడియో ఎందుకు పెట్టలేదు? సిగరెట్ కేసు బంగారందేనా? ఇంగ్లాండు మేకా లేక ఇండియాదేనా? మీ దగ్గర కెమెరా ఉందా?...కోడాకా...అగ్‌ఫాయా?..."

రటంతీకి ఖగేన్ చాల నచ్చాడు. అతనితో మాటాడుదామని నాలుగైదు సార్లు ప్రయత్నించాడు. కాని—భద్రకాళీ, రూబీలు గుడ్లురిమి చూసేసరికి కుక్కిన పేనులా ఐపోయాడు. అసలు రటంతీ రావడం భద్రకాళికి సుతరామూ యిష్టంలేదు. ఐతే చిన్నకొడుకు మానిక్ పట్టుదలవల్ల పిలవక తప్పిందికాదు. కాగా ఇంట్లో 'బేరా' లేడు. మరి—ఫలహారపు ప్లేట్లూ—టీ కప్పులూ సర్దడమూ, తియ్యడమూ ఎవరు చేస్తారు?

పార్టీ ఆరంభమైంది. గాజు ప్లేట్లలో తీపి, కారపు సామానులు నలుగురు నౌకర్లు సర్దుతున్నారు. తెల్లని ఆఫ్ పంట్లాలూ, సగం చేతుల షర్టులూ, ఎర్ర పగిడీలూ వేసుకొని వాళ్ళు చకచక నడుస్తూ పనులు చేసుకుపోతున్నారు. భద్రకాళీ పురమాయిస్తున్నది సర్దిన ప్లేట్లను రటంతీ రూబీకి అందిస్తున్నాడు. రూబీ వాటిని తీసుకొని మేజా మీద ఒక్కొక్క కుర్చీకి ఎదురుగా పెడుతున్నది. అంతా అయాక ఆరగింపు లారంభమైనై!......కాసేపయాక భద్రకాళీ — "అదేఁవిటి బాబూ...ఏమీ తినకుండా అలా చెయ్యి వేలేసేశావ్?... మరిరెండు కచౌడీలో, మటన్ చాప్సో వెయ్యమన్నావా? ఏమమ్మా రూబీ... చూస్తూ ఏమిటలా కూచున్నావ్?... ఇంతా శ్రమపడి ఇవన్నీ తయారుచేయడం —మనకోసమా? ... ఆఁ ... ఖగేన్ బాబూ! వంటకా లెలా ఉన్నాయ్?... ప్రతిదీ రూబీయే, స్వయాన, తన చేతుల్తో చేసిందిసుమా?" అన్నది.

"ఓ...బలే బావుందండి! నిజంగా, ఇంత రుచికరమైన పదార్థాలు నేటివరకూ తినలేదంటే నమ్మండి! అన్నీ అమృత తుల్యంగా ఉన్నాయ్!" అన్నాడు ఖగేన్ ఖన్నా!

అదివిని భద్రకాళీ ఒక్కసారి బెలూనులా ఉబ్బిపోయింది — "నిజంగా నేన్నా బాబూ?...అబ్బా!...మా రూబీ తల్లి శ్రమ ఫలించిం దన్నమాట! ఈ వస్తువులన్నీ ఎంతో శ్రద్ధగా, జాగ్రతగా చేసిందంటే నమ్ము! అసలు రూబీ వంట పనుల్లో 'ఫస్టు' అని చెప్పడానికి గర్విస్తున్నాను," అన్నది భద్రకాళీ.

రటంతీకి భద్రకాళీ మాటలు మోహం మొత్తినట్టు చేశాయ్! నోటినిండా ఉన్న కచౌడీ కసాబిసా నమిలి, బుగ్గ పక్కకు నెట్టి, "అదేఁవిటి పిన్నీ?...ఇవన్నీ మా పెద్దక్కకదా తయారుచేసి పంపించింది!" అన్నాడు.

భద్రకాళీ రటంతీవేపు గుడ్లగూబలా చూస్తూ "ఒరేయ్ వెధవా! మహా తెలివైనవాడిలా అన్నిట్లో బయల్దేరతావ్? నోర్మూసుకు తగలడలేవూ?" అన్నది.

అప్పటికి రటంతీ కచౌడీని కడుపులోకి దించుకొని, నిర్భయంగా అన్నాడు—

"వారేవా? మా అక్క ఇవన్నీ కేరియర్‌లో సర్ది ఇస్తే నేనే కదా మా యింటినుండి తెచ్చి యిచ్చాను!"

పాపం—రూబీ గిజగిజలాడిపోయింది మూడుసార్లు ముఖానికి వేసిన పౌడర్ కోటా ఒక్కసారి ఛట్‌మని మాడిపోయింది! తల్లి వేపూ ఖగేన్ వేపూ గాభరాగా చూసింది. వస్తూన్న నవ్వును ఖగేన్‌బాబు బలవంతంగా ఆపుకుంటునట్లు రూబీకి తోచింది. భద్రకాళీ అంతా గమనించింది. రటంతీని యిక అక్కడ ఉండనిస్తే లంకా దహనం అవక తీరదని పానూతో "చూడబ్బాయ్! ఈ పాజీ వెధవను అవ

తలకు తీసుకుపోదూ? పెద్దాచిన్నా ఉన్నా రన్న బుద్ధి ఐనా లేదు గాడిదకు! ఉన్నవీ లేనివీ ఒకటే వాగుడు?" అన్నది. పన్నాలాలు రటంతీ చేయి పట్టుకొని బయటకు తీసుకుపోయి "ఒరేయ్! నీ తిండి ఐందిగా!...ఇక ఇంటికి పోరాదూ?" అన్నాడు.

"ఎక్కడన్నాయ్? ఇంకా, బర్ఫీ, కట్లెట్, నిమ్కీ, చట్నీ...పెరుగూ, ఇంకా ఉన్నాయిగా?" అన్నాడు రటంతీ, నిస్సంకోచంగా.

"అవి తెచ్చి యిస్తాలే! లోపలకు రాకు! ఇక్కడే ఉండు" అని పన్నాలాలు లోపలకువెళ్ళి ఒక విస్తరాకులో వాటినిపెట్టి తెచ్చియిచ్చాడు.

"మరి కారియరో?...అక్క తెమ్మన్నదిగా?" అన్నాడు రటంతీ. వెంటనే పన్నాలాలు ఖాళీ కారియరు తెచ్చి రటంతీ ఎదట పడేసి "తిని-పో!...మరి లోపలకు రాక" అని వెళ్ళిపోయాడు రటంతీ అక్కడే కూచొని ఆ తినుబండారాలు ఒక్కొక్కటీ తీరుబాటుగా తిని, తరవాత కారియరు పట్టుకొని వెళ్ళిపోయాడు.

రటంతీవల్ల రేగిన వాతావరణం అందరి ఉత్సాహాన్నీ మాయంచేసింది. ముఖ్యంగా రూబీ, భద్రకాళీ ముఖమండలాలు మంగళం పెంకు లయాయ్! విధిలేక, తెచ్చిపెట్టుకున్న వికాసంతో మాటామంతీ జరుపుతున్నారు—కాని పార్టీకి ముందున్న ఉత్సాహమూ, నవ్వులూ, కోలాహలమూ రవంతయినా కనబడలేదు. దేనికోసం యీ పార్టీ కల్పింపబడ్డదో అది వెళ్ళడించడానికి భద్రకాళీకిగాని, చివరకు పన్నాలాలుకుగాని ధైర్యం చాలిందికాదు. నిజంగా రటంతీ ఆ సమయంలో ఒంటరిగా దొరికిఉంటే ఆ తల్లీ కూతుళ్లూ ముక్కలు ముక్కలు చేసి పోగుపెట్టి ఉందురు. ఐనా భద్రకాళీ గొప్పకుపోయి గోతిలో పడ్డది కాని— ఆ రటంతీ నైజం తెలిసికూడా, అంత నిరాఘాటంగా అబద్ధాలెందు కాడాలి? చెప్పాల్సింది నేర్పుగా, కండ్ల సంజ్ఞతో



పూర్తి చేయవచ్చునే! నోరు జారిపోయాక ఎన్నను కుంటే ఏం లాభం?

జరిగిపోయినదాన్ని కప్పిపుచ్చడానికి భద్రకాళీ లేని నవ్వుతో గట్టిగా, అసంబద్ధంగా ఏదేదో మాటాడింది. పన్నాలాలు కూడా స్నేహితుణ్ణి మధ్యపెట్టటానికి ఏవేవో తలాతోకాలేని హాస్య ప్రసంగాలు దొర్లించాడు. రూబీ ఎంతో సంతోషంగా ఉన్నట్టు మధ్యమధ్య చిన్నచిన్న జవాబులూ, వాక్యాలూ, విడిచిపెడుతున్నది. ఏదైనప్పటికీ అప్పటి స్థితి నిజానికీ, సహజానికీ యోజనాల దూరం ఉన్నట్టు అందరూ అనుభవించారు. ఖగేన్‌బాబు మాత్రం ప్రతివారికీ చిరునవ్వుతో 'అవును-కాదు-ఒహో-అలానా...' అనే జవాబులతో తనలోని భావాన్ని బయట పెట్టకుండా తృప్తిపర్చ ప్రయత్నించాడు.

కాసేపటికి పార్టీ పూర్తయింది. అందరూ తాంబూలం సేవించారు. ఖగేన్‌బాబు లేచి నిల్చుని "ఇక శలవిప్పించండి!" అని చిర్నవ్వుతో "జరూరు పనిమీద యింకో చోటికి వెళ్ళాలి! మీరిచ్చింది కేవలం టీ పార్టీ ఐనప్పటికీ తిన్నవి మాత్రం జీర్ణ కావటానికి కనీసం మూడు రోజులు ఉపవాసం చెయ్యాలేమో?" అన్నాడు. భద్రకాళీ లేని వికాసాన్ని తెచ్చుకుంటూ "అయ్యో బాబూ! ఏం తిన్నావని అలా అంటున్నావ్?...మరోసారి తప్పకుండా వచ్చి మా గృహం పావనం చెయ్యాలని నా



"ఆఁ ఇప్పుడు పాలుపితకడం చూశావు కదా ఇప్పుడు చెప్పు నువ్వు ఈ వేళ ఏం తెలుసుకున్నావో?"
"ఆవు పాలుయిస్తుంది అనేమాట అబద్ధం మనమే పితుక్కోవాలి."

కోరిక! ఇంకా...చాలా విషయాలు నీతో సావకాశంగా మాటాడాలి! వస్తావు కదూ?" అన్నది.

"అలాగే లెండి!" అని ఖగేన్ వెళ్ళిపోయాడు.

* * *

కొంతదూరం వెళ్ళాక రటంతీ ఖగేన్ దృష్టిలో పడ్డాడు. కారు ఆపి "ఏయ్ అబ్బాయ్...నిల్చో!" అన్నాడు.

రటంతీ రక్కున ఆగి "నన్నేనా పిలుస్తున్నారు?" అన్నాడు.

"ఔను! నీ పేరేమిటి?". ఖగేన్‌బాబు మృదువుగా ప్రశ్నించాడు.

''రటంతీకుమార్!''

"ఇలారా కారులోకి...మీ యింటి దగ్గర దిగబెట్టేస్తా"

రటంతీ ఆనందంతో గబగబా కారులో ఎక్కి ఖగేన్‌బాబు పక్కన కూచున్నాడు.

''నీ పేరేమిటన్నావ్?'' చిర్నవ్వుతో ఖగేన్‌బాబు మళ్ళీ ప్రశ్నించాడు.

''రటంతీకుమార్!''

''ఏఁవిటీ? రటంతీకుమార్! బలే గమ్మత్తుగా ఉందే?"

''నా పూర్తి పేరు శ్రీ రటంతీకుమార్ చౌదరి! నేనేమో రటంతీ పూజనాడు పుట్టానట! అందుకని ఈ పేరు మా తాత గారు – అంటే అమ్మనాన్నగారు పెట్టారట! నాకింకా ఇద్దరక్కలున్నారు. పెద్దక్క పేరు జయంతీమంగళ!చిన్నక్క పేరు వాసంతీశుభద!–''

''ఓహో! మీ పేర్లన్నీ చిన్నచిన్న చేంతాళ్ళలా ఉన్నాయ్!...భేష్! నువ్వే మిటి చదువుతున్నావ్? మీ యింట్లో ఇంకా ఎవరెవరున్నారు?...మీ ఇల్లెక్క డుంది?–"

"మా యిల్లు ... అదిగో–ఆ రోడ్డు మలుపుదాటితే–పెట్రోలు బంకు ఉన్నది, దానికి పక్కగా కుడిచేతి వేపు–మా యిల్లుంది. నేను ఆరో తరగతి చదువు తున్నాను. మా నాన్నగారు రైల్వేలో పని చేస్తున్నారు. ఎప్పుడూ క్యాంపుల్లో ఉంటారు. మా అక్కలూ, అమ్మా, నేనూ ఇంట్లో ఉన్నాం! మా అక్కలకు ఇంకా పెళ్ళికాలేదు. అరే ... మర్చిపోయాను...టామీ, రూపీ కూడా మా యింట్లో ఉన్నాయ్! టామీ అంటే కుక్కపిల్ల! రూపీ అంటే తెల్లపిల్లి! టామీ గొప్ప తిండిపోతు. రూపీ అలాక్కాదు. చాలా మంచిది. ఎంత పెడితే అంతే!... రూబీకేమో పిల్లలు పుడతారట! అక్క చెప్పింది. మీకు కావాలంటే ఒకటో, రెండో పిల్లలు యిస్తాలెండి–''

రటంతీ మాటలపోగనీ, జంకూ, గొంకూ లేని పిల్లాడనీ, ఎలాంటి కొత్త వాళ్ళయినా, పాత మనుషుల్లానే సరదాగా, కలుపుగోలుతనంగా ఉంటాడనీ ఖగేన్‌బాబు గ్రహించాడు.

"ఐతే మీరు రూబీ అక్కతో కలిశారా?" అన్నాడు రటంతీ.

ఖగేన్‌బాబు నవ్వుతూ "ఏదీ మరి? పార్టీమధ్యలో నువు వేసిన బాంబు అందరి తలకాయల్నీ బద్దలుగొట్టేసిందిగా?" అన్నాడు.

పాపం రటంతీ చిన్నబుచ్చుకున్నాడు– "మీరు ఉత్తినే అంటున్నారుగాని నే నేం జేశాను? నా తప్పు లేందే?" అన్నాడు.

"అరరే? నువు తప్పుచేశావనా?... నీలాంటి బుద్ధిమంతు డున్నాడా? ఐనా – నీలో ఉన్నది ఒక్కటే లోపం! ఏమి టంటే – బుర్రలో జ్ఞానమనేది లేదు."

"ఐతే నే నబద్ధాలాడానా?"

"లేదు. కాని – ఎక్కడ ఎలా మాటాడాలో నీకు తెలియదు. మీ రూబీ అక్క

యింట్లో ఏది చెప్పకూడదో అదే చెప్పా
శావ్!...ఏం?"

"ఔను. నేను నిజమేచెప్పాను. పిన్ని బతిమాలి చెబితేనే మా పెద్దక్క ఆ వస్తువులన్నీ చేసిపెట్టిందట!"

"లేదు లేదు! నీ కేమీ తెలియదు. మీ రూబీ అక్క అవన్నీ చేసింది!"

"ఛత్! మీ కేమీ తెలీదు. పిన్ని చెప్పింది నిజమని నమ్మేశారు. అసలు రూబీ అక్కకు ఆలుదుంపలూ, కోడి గుడ్లూ వండడమే తెలుసు. అదైనా ఉడకబెట్టి కాస్త ఉప్పూ, మిరియాలపొడీ వేసి పిసికివేయడమే! మరే వంటా రాదు. అంతేకాదు, కుట్టుపనులూ, అల్లికలూ, బొమ్మలువేయడమూ రానే రాదు. ఆ టేబిలుమీది గుడ్డ - రూబీ అక్కగారిది కానేకాదు! పక్కయింటి సుమతి అత్త గారిది ఆ సుమతి అత్తే అన్ని కుట్లూ, అల్లికలూ చేసింది. ఆ రంగులబొమ్మ మాది! - మా పెద్దక్క వేసింది! నే నివన్నీ చెప్పనే లేదు!—"

"ఓహో!...అలానా?... సరేగాని ఆ వంటలన్నీ మీ అక్క - వాసంతీ జయంతీ సుభదా మంగళా —" నవ్వుతూ ఖగేన్ బాబన్నాడు.

"మా అక్కల పేర్లు రెండూ కలిపేశారు. మా పెద్దక్కపేరు జయంతీ మంగళ!" అన్నాడు.

"ఆఁ... మీ పెద్దక్క ఆ వంటలు చేసిందని ఏమిటి సాక్ష్యం?...మీ యింటికి వస్తే చేయించిపెడతావా?"

"ఓ యెస్! అలా పెట్టకపోతే, నా రెండు చెవులూ గట్టిగా మెలిపెట్టండి—"

"ఐతే నువుగెలిస్తే నా రెండుచెవులూ మెలిపెడ్తావా ఏమిటి?"

"మీరు పెద్దవారు. అలా చేస్తానా? ఆఁ నేనే గెలిస్తే మీరు జరిమానా చెల్లించాలి!"

"జరిమానా?... ఎంత?"

రటంతీ ఆలోచించి "ఒక్క రూపాయి" అన్నాడు.

"ఒక్కరూపాయేనా?"

"ఐతే...రెండు! ఔను! మీరు గెలిస్తే నా రెండుచెవులూ మెలేస్తారుగా? నేను గెలిస్తే రెండు రూపాయలు! రెంటికి రెండు! ఇప్పుడే పదండి - వెళ్దాం!"

"బావుందిలే?... ఇప్పుడేగా పొట్ట పగిలేలా తిన్నది!... మళ్ళీ మీయింట్లోవి ఎక్కడ పట్టించేది?"

"ఐతే...రేపు...కాదు— ఎల్లుండి... అవును. ఎల్లుండి ఆదివారంకదా - ఆ సాయంత్రం రాండి!"

"చూస్తే నువ్వే ఇంటికి పెద్దలా ఉన్నావ్?...అక్కడ నాకు తెలిసినవాళ్లు ఎవరూ లేరే? పిలవని పేరంటంగా వెళ్ళి భోజనానికి కూచుంటే అంతా నన్ను 'తిండిపోతు తిమ్మన్న' అనరూ?"

"అలా ఎందు కంటారు ? మీరెవరో నాకు తెలుసుగా ? ముందుగా ఇంట్లో చెబుతాను. అప్పుడు మీరు వస్తే ఎవరూ ఏమీ అనరు. కాని — మేం పేదవాళ్ళం! రూబీఅక్క ఇంట్లో పెట్టినన్ని వస్తువులు పెట్టలేం! ఇవైనా మా అక్క తయారు చేసిందంటే పిన్ని—చేపలూ, మాంసమూ, నెయ్యి, బాదం, పిస్తా, మైదా అన్నీ పంపించింది !...సరే ఆదివారం వస్తారు కదూ ?..."

"వస్తాను.నువ్వు విందుకు పిలవడమూ, నేను రాకపోవడమూ కూడానా ? తప్పక వస్తాను. కాని టీ తప్పించి — మరేమీ వద్దు! తెల్సిందా ?"

"అలానైతే మా పెద్దక్కవంట సంగతి మీ కెలా తెలుస్తుంది ?'

"అక్కరలేదు. మనిషిని చూస్తే చాలు! ఎవరేం చెయ్యగలరో పోల్చుకుంటాను. సరేగాని — ఇ వ్వా ళ మీ రూబీఅక్క యింట్లో జరిగినవి ఒకటికూడా నువ్వు మీ యింట్లో చెప్పగూడదు సుమా?అలానైతే నేను టీ తాగకుండా వెళ్ళిపోతాను. ఇంకో మాట ! ఆదివారం మీ నేస్తం—మానిక్‌ను పిలవొద్దు "

"అలానేలెండి !"

"ఐతే రటంతీ కుమార్......మీ పెద్దక్క పేరేమిటన్నావ్ ? ... అఁ ... జ య ం తీ మ ం గ ళా ! భేష్! పేరు పెద్దేనా...లేక...అందచందాలు కూడా పెద్దవేనా ?"

"ఓః..మా పెద్దక్క చాలా అందకత్తె అని అంతా అంటారు. రూబీ అక్క ఒక గంటసేపు సబ్బూ, స్నో, పౌడరూ రుద్దినా తెల్లగా అవదు. కాని మా పెద్దక్క ఏమీ రుద్దకుండానే తెల్లగా ఉంటుంది. పాట లెంత చక్కగా, హాయిగా పాడుతుం దంటారు ? ఐతే పాడమనగానే పాడదు. నాలుగైదుసార్లు బతిమిలాడాలి! మీ కింకా తెలియదు కామోసు ? మా పెద్దక్క ఎం.ఏ ప్యాసయింది! రూబీ అక్కేమో మెట్రిక్ ముమ్మాటు ఫేలైంది!...పెద్దక్కకు ఫస్ట్ క్లాసైన ఉద్యోగం దొరుకుతుందట ! మా తాతగా రేమంటారో తెలుసాండి ?... లక్ష్మి, సరస్వతీ, అన్నపూర్ణా యీ ముగ్గుర్నీ కలిపి, మూడుచేత భాగిస్తే వచ్చే అన్నరు మా పెద్దక్కట —

"సరేగాని మీ పెద్దక్క నిన్నేమని పిలుస్తుంది ?"

రటంతీ 'హి—హ్హి—హ్హి' అని నవ్వి — "నన్నా ?...మాపెద్దక్క నన్ను—'ఒరేయ్— తోకలేని వీర హనుమంతూ' అని పిలుస్తుంది," అన్నాడు.

"భేష్ ! మంచిపేరే పెట్టింది ! నేను మాత్రం 'నారదమునీ' అంటాను. పాపం! మీ పిన్ని భద్రకాళిగారూ, మీ అక్క రూబీగారూ నీ ప్రతాపంవల్ల తల్లక్రిందులైపోయారు — "

"అదే — మాయిల్లు!...ఆ ది వా ర ం సాయంత్రం — తప్పక రావాలి !"

"తప్పక వస్తాను !"

ఇంటికివచ్చి రటంతీ గబగబ పెద్దక్క దగ్గరకు వెళ్ళాడు –

"పెద్దక్కా! మాంచి ఫస్ట్ క్లాసైన సంగతి!...ఖగేన్ బాబును నేను టీకి పిల్చాను ఎల్లుండి ఆదివారం సాయంత్రం వస్తాడు –" అన్నాడు

"ఎవర్రా యీ ఖగేన్ బాబు?" జయంతి ప్రశ్నించింది

"ఇవాళ మానిక్ ఇంట్లో టీ పార్టీకి వచ్చాడే అతను!...అతనికీ నాకూ బాగా స్నేహమైందక్కా! అతనికి ఎంత మంచి మోటారుకారుం దనుకున్నావ్ ఆఁ... విందుకు నువ్వేమీ చెయ్యక్కర్లేదులే!... చేపల కచౌడీలూ, కైమా కట్లెట్లూ, మామిడిపండ్ల చట్నీ, టీ, బస్...... అంతే।"

జయంతి తల్లిని పిల్చి "చూశావే అమ్మా! నీ ముద్దుల కొడుకు పని?... ఎవరో ఖగేన్ బాబట...వీ డతనిని టీకి పిల్చాడట...అతను వస్తాడట...ఫలహారాలు నేను చేసిపెట్టాలట! వీడు ఆర్డరు జారీ చేశాడు'...ఐతే రటంతీ! నువ్వు చెప్పేవాటికి సామాన్లో? వాటికయే ఖర్చు నువ్విస్తావా?" అన్నది.

"ఓ యెస్! నే నిస్తాను' రెండు రూపాయలు ...కాని ఇవ్వాళగాదు... ఎల్లుండి ఊహుఁ...ఆవలెల్లుండి–"

"ఎక్కణ్ణించి తెచ్చియిస్తావ్' భద్రకాళీ పిన్నిగాని ఏదో పనీ పాటా చేయించుకొని యిస్తానన్నదా ఏఁమిటి?"



"రైల్వేస్టేషను ఇంతదూరంగా కట్టేరేమిటి?"
"రైలుపట్టాలకి దగ్గరగా ఉండాలని అక్కడ కట్టేరులాగుంది."

"ధత్! నీకేమీ తెలీదే' తరవాత చెప్తానుకదూ ఎక్కణ్ణించి తెచ్చానో'... ఆఁ ఇవ్వాళ మాత్రం చెప్పకూడదు"

"ఏమో? ముక్కూ ముఖం తెలీని వాళ్ళకోసం నేను పాట్లు పడలేను."

"ముక్కూ మొఖమూ తెలీకపోవడమేమిటే? ఖగేన్ బాబుకూ, నాకూ బాగా నేస్తమైంది అతను మోటారులో నన్ను కూచుండబెట్టుకొని మన యింటి వరకూ తెచ్చాడు' తెల్సిందా?"

"ఓ,..అలాచెప్పు! అందుకే అంతగా పొగిడేస్తున్నావ్? కాని నేనేమీ చెయ్యను"

"అదికాదమ్మాయ్! పిల్లవాడు తెలిసో తెలియకో పిల్చాడు ఆ పెద్దమనిషిని సత్కరించడం మన పని కదటమ్మా'" అన్నది తల్లి.

ఆదివారం సాయంత్రం ఖగేన్ ఖన్నా రటంతీ యింటికి వచ్చాడు. మానిక్ యింటికొచ్చిన అట్టహాసంతో రాలేదు. సామాన్య దుస్తుల్తో సింపుల్‌గా ఉన్నాడు. ఆఁ! కారుమాత్రం తెచ్చాడు!

రటంతీ యింట్లో ఉన్నవి రెండే గదులు! పైగా చిన్న వంటగది ముందు గదిలోనే అంతా ఏర్పాటు చేశారు. ఒక బల్లమీద జంపఖానా, దానిపైన తెల్లని దుప్పటీ పర్చారు దుప్పటి మీద అక్కడక్కడా అందమైన లతలూ పువ్వులూ కుట్టి ఉన్నాయ్! రెండు బాలీసులు అమర్చారు.

రటంతీ తల్లి సునందాదేవి ఖగేన్ బాబును గౌరవంగా ఆహ్వానించింది.కొత్త వాడైనా ఎంతో ఆత్మీయత ప్రకటించింది. రటంతీ వంటగదికీ ముందు గదికీ సందడిగా తిరుగుతున్నాడు

ఖగేన్ మంచంమీద కూచున్నాడు. అతని పక్కను రటంతీ మఠంవేశాడు సునందాదేవి నిల్చొని ఏదో పిచ్చాపాటీ మాటాడుతున్నది. అంతలో జయంతి, వాసంతి గాజు పళ్ళెల్లో ఫలహారాలు తెచ్చి ఖగేన్ ఎదట ఉంచారు.

"ఇదేమిటోయ్ రటంతీకుమార్? నీకు నేనేమని చెప్పాను? నువ్వేం చేశావ్? ఇవన్నీ ఎందుకు చెప్పు?'' అన్నాడు ఖగేన్

''వా? ఇవేమాత్రం? ఐనా—ఇవన్నీ మీకోసఁవేనా ఏమిటి? ఆ వేళ మానిక్ యింట్లో నేనేమీ తినలేదుగా? అందుకని—నాకోసం కూడా వీటిని తయారు చేయించాను'' అన్నాడు రటంతీ

జయంతికి తమ్ముడు మాటలు నవ్వు తెప్పించింది. "తిండిపోతు తిమ్మన్నా—ఏమిటా మాటలు?" అన్నది చిర్నవ్వుతో

రటంతీ అక్కవేపు అదోలా చూసి, పళ్ళెంలోని కచొడీ తీసి కరకర నముల్తూ ఖగేన్ చెవిలో మెల్లగా "చెప్పండి! నేనన్నది నమ్మినట్లేనా?... మీరు ఓడిపోయారు! ఇక తియ్యండి రెండు రూపాయలు ! కాదు—ఇప్పుడు కాదు—తరవాత! ఆఁ.పెద్దక్కను పాటలు పాడమనండి!'' అన్నాడు. ఖగేన్ కూడ మెల్లగా రటంతీ చెవిలో—''ఇవ్వాళకాదు. మరోసారి వచ్చినప్పుడు పాడమంటాను" అన్నాడు.

సునందాదేవి చిర్నవ్వుతో ''ఏఁరా రటంతీ? అతణ్ణి ఏమిటలా చికాకు పెడుతున్నావ్? సరిగ్గా తిననివ్వవా ఏఁమిటి?" అన్నది

''ఊఁ(...జలగలా పట్టుకున్నాడు వెధవ!'' అన్నది వాసంతి

"అబ్బే! రటంతీకుమార్ ఏమీ చికాకు కలిగించలేదు. మేమిద్దరం స్నేహితులం. నేనంటే రటంతీకి చాల అభిమానం!'' అని ఖగేన్‌బాబు మందహాసం చేసి జయంతిని చూస్తూ ''మీ తమ్ముడు మిమ్మల్ని మహాపొగుడుతూ ఉంటాడు.




మా పెద్దక్క అన్నిట్లో మంచి ప్రవీణురాలని–'' అన్నాడు.

''బుద్ధిలేని గాడిద!'' అని జయంతి మెల్లగా నవ్వింది.

''ధత్ ! నేను బుద్ధిలేని గాడిదనా?... అయ్యోరామ ! నేనేమో మా పెద్దక్క... చక్కగా, రుచిగా ఫలహారాలు చేస్తుందన్నాను. అందులో బుద్ధి లేకపోవటమేమిటి? సరే !...మా పెద్దక్కకు వంటరాదు...పాటరాదు...మాటరాదు.. చదువురాదు...సంధ్యరాదు...కుట్టురాదు.. మట్టురాదు...ఇంకా—''

మధ్యలోనే జయంతి నవ్వి ''అందుకేరా నీకు అలా పేరుపెట్టాను–'' అన్నది. ఖగేన్‌బాబు కూడా నవ్వి ''ఓ–తోకలేని వీరహనుమంతూ అనికదూ?'' అన్నాడు.

జయంతీ, వాసంతీ ఖగేన్ వేపు ఇతని కెలా తెలిసిందా అన్నట్టు చూశారు. అది గ్రహించి రటంతీ ''నేనే చెప్పానక్కా!'' అన్నాడు.

కాసేపటికి టీ, ఫలహారాలు సేవించడం పూర్తయింది. ఖగేన్

నిల్చొని ఆ తల్లీ పిల్లలకు ధన్యవాదాలు చెప్పి శలవు తీసుకున్నాడు. రిటంతీ అతనితో బయల్దేరాడు.

''అక్కా! ఖగేన్‌బాబుగారి కారులో కూచుంటే అసలు ఇంట్లో కూచున్నట్టే ఉంటుంది. ఎలాంటి శబ్దమూ, కుదుపూ, గడబిడా ఉండదు.'' అన్నాడు రిటంతీ.

''పదవోయ్ రిటంతీకుమార్!'' అంటూ ఆ పిల్లవాని చేతిని పట్టుకొని ఖగేన్‌బాబు బయటకు నడచాడు.

* * *

తోవలో రిటంతీ ఖగేనులు బాతాఖానీలో పడ్డారు "నిజంగా రూబీ అక్కకు ఏమీరాదు సుమండీ! ఇక పిన్ని అంటే మహా గొప్పల గోవింద! అబద్ధాల పుట్ట! ఆ అబద్ధాలు వింటుంటే నాకు అసహ్యంగా ఉంటుంది_'' అన్నాడు రిటంతీ

''ఔనౌను! నేనంతా గ్రహించాను'' అన్నాడు ఖగేన్‌బాబు

''ఐతే మీరు జయంతీ అక్కతో ఒక మాటయినా మాటాడారుకారేం?... రూబీ అక్కతో మొన్న ఎంతో మాటాడారు.''

''మీ రూబీ అక్క సంగతి వేరు!... మీ జయంతి అక్క సంగతి వేరు!... ఐతే_మీ జయంతీ అక్కతో ఎలా మాట్లాడమో తెలియలేదు ఏదైనా సుళువుంటే చెబుదూ!'' నవ్వుతూ అడిగాడు ఖగేన్‌బాబు.

''ఓస్...దానికేముంది? చూడండి! మా బడి సంగతే చెబుతాను. ఎవరైనా కొత్త కుర్రాడు వచ్చాడూ అంటే వాడితో మాటాడి మంచి చేసుకోవాలంటే ముందుగా వాడి దగ్గరకు వెళ్తాం! పక్కనే నిల్చుంటాం!...కళ్లలోకి చూస్తాం!...మెల్లగా నవ్వుతాం!... తరవాత_''నీ పేరేమిటి?'' అంటూ వాడి భుజంమీద చెయ్యివేస్తాం...వీపు మీద తడతాం!...ఆ పైని తినడానికి ఏదైనా పెడతాం! లేదా జేబులో నుండి రెండు గాజుగోళీలు తీసి ఇస్తాం!...... బస్! దాంతో స్నేహం కలిసిపోతుంది! ఇక ఎవడి జట్టయినా విడదీసుకోవాలంటే రెండు బుగ్గలూ బాగా పూరించి, వాటి మీద ముమ్మారు పిడికిళ్లతో కొట్టి, కంటిరెప్ప వెంట్రుకలు రెండు తీసి వాడి మీద పారేస్తాం! తెల్సిందా?''

''ఓహో!...కానైతే... మీ జయంతీ అక్కతో అలా మాట్లాడ్డానికీ, వీపు మీద తట్టడానికీ ఎలా వీలవుతుంది? మీరంటే అంతా పిల్లలు. బాధలేదు పెద్ద వాళ్లు అలాచేస్తే తప్పుకాదూ?''

''ఐతే మరెలా?''

''చూద్దాం! దేవుడు మేలుచేస్తే... అంతా సవ్యపడుతుంది కాని, ఈ విషయాలు మీ జయంతీ అక్కతో చెప్పకు సుమా?''

''ఓయబ్బో?...మా జయంతీ

అక్కతోనే? చెవులూడదీసి గూబలు పగలెయ్యదూ?''

*  *  *

నెలరోజులు గడిచాయ్! భద్రకాళీ బలవంతంతో ఈ వ్యవధిలో ఖగేన్‌బాబు వాళ్ళింటికి ఒకసారి వెళ్లాడు. రటంతీ యింటికి మాత్రం మూడుసార్లు వెళ్లాడు.

ఒకనాటి శుభోదయవేళ ఖగేన్‌బాబు తండ్రి నగేన్‌ఖన్నా, మేనమామ బిపిన్ బిహారీ, చినతాత కొడుకు కాళీ చరణుడూ మరో ఆరుగురు దూరపు బంధువులూ రటంతీ యింటి కొచ్చారు. రటంతీ తండ్రి పేరు ధీరేంద్రనాథ్ చౌదరి, శలవు తీసుకొని ఇంట్లోనే ఉన్నాడు. ఒకగంట అంతా మాటామంతీ ఆడుకున్నారు. తరవాత మూహూర్తం నిర్ణయించుకున్నారు. జయంతీ ఖగేనుల వివాహం మాఘ మాసంలో జరగబోతున్నది!

వివాహం మూడురోజు లున్నదనగా భద్రకాళీ ఇంట్లో మహిళామండలి సమావేశమైంది. ముఖ్యవక్త భద్రకాళీ! వివిధ భంగిమల్లో చేతులూ, కండ్లూ తిప్పుతూ భద్రకాళి విమర్శించుకుపోయింది—

"ఛీ... ఛీ... ఛీ! ఎంత అపఖ్యాతి?... ఘోరకలి బాబూ ఘోరకలి!...ఏనాడైనా ఇలాంటి విడ్డూరం విన్నామా? వెధవ...ఆ పేలు గాయ రాలుగాయ లేడూ–రటంతీగాడు–వాడు సంధానకర్తట?...ఆ ఖగేన్ ఖన్నాను జబర్దస్తీగా యింటికి తీసుకుపోయి ఆ సిగ్గుమాలిన వాళ్ళ దగ్గర ఒదలడం–ఆ పెద్ద మనిషి కూడా వాళ్లతో...ఛీ ఛీ! ఐనా ఆ తల్లి సునందా దానికైనా బుద్ధీ బుర్రా ఉండొద్దూ? ఇంట్లో మగాడు లేనప్పుడు–అవతల వచ్చిన వాడికి టీలూ, టిఫిన్లూ, విందులూ పెట్టి రప్పించుకోవడమా?...ఆ జయంతీ ఎం ఏ. చదివిందట? ఎమ్మేదాని చదువు చట్టుబండలుకానూ?... తగుదునమ్మా అని ఆ పరాయి మగాడితో, వయసు కాడితో పకపకలూ, వికవికలూ, వినోదాలూ, విడూరాలూ...ధూధూ...ధూ! లేకపోతే లేకపోయిందిగాని – ఇలాంటి అప్రతిష్ఠ పనులుచేసి ఎవరైనా పెళ్ళి కొడుకుల్ని వలవేసి పట్టుకుంటారా?... అన్నిటికీ ఆ ఆనారి వెధవ...రటంతీగాడి తండ్రి...ఆ ధీరిగాణ్ణి అనాలి! భ్రష్ఠు వెధవ! ఆడదాని చేతిలో కీలుబొమ్మ! ఆడు కోతీ అంటే ఆడ్డం – పాడుకోతీ అంటే పాడ్డం!..పోన్లెండమ్మా! అలాంటి బే సాంప్రదాయపు యింట్లో పుట్టిన వెధవ ..ఆ ఖగేన్‌గాడు – మా రూబీ తల్లికి తప్పిపోవడమే చాలా చాలా మంచిదైంది!..దుర్గామయీ! కాళీతల్లీ! . మీకు శతకోటి ప్రణామాలు!..... "

★